క్లుప్తంగా

బసవేశ్వర స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి

కోసిగి: మండల కేంద్రంలో బసవన్న కొండపై వెలసిన శ్రీ బసవేశ్వర స్వామికి మంగళవారం అమావాస్య పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువజామున జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకుపూజలు గావించి మహా మంగళ హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని నారికేళాలు సమర్పించి పూజలు చేశారు. భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడండి



మాట్లాడుతున్న ఎస్ఈ ఉమాపతి

ఆదోనిఅర్బన్: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎస్ఈ ఉమాపతి సూచించారు. మంగళవారం స్థానిక డీఈఈ కార్యాలయంలో మంత్లీ రివ్యూ మీటింగ్ జరిగింది. ముందుగా రికార్డులను తనిఖీ చేశారు. డివిజన్ స్థాయి అధికారులతో మాట్లాడారు. విద్యుత్ బకాయిలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. పాత మీటర్లను తొలగించి కొత్త విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేయాలన్నారు. అగ్రికల్చర్ కింద రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఏదైనా అంతరాయం ఉంటే ముందుగానే రైతులు, ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వినియోగదారుల వద్ద మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ డీఈ సుధాకర్‌కుమార్, ఏడీఈ పురుషోత్తం, ఏఈ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు కందిపప్పు ఇవ్వాలి

ఆదోనిటౌన్: పట్టణంలోని మహాయోగి లక్ష్మమ్మవ్వనగర్, 59వ రేషన్‌షాపులో లబ్ధిదారులకు కంది పప్పు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంతం మహిళలు మంగళవారం ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రేషన్‌షాపు డీలర్ గోపాల్, వార్డు కౌన్సిలర్ చలపతి వారిని సముదాయించారు. ఈ విషయాన్ని యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తహసీల్దార్ వెంకటలక్ష్మిని ఫోన్ ద్వారా సంప్రదించారు. స్పందించిన తహసీల్దార్ బియ్యంతో పాటు కందిపప్పు కూడా సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

జయప్రదం చేయండి



ఆటో జాతలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కోసిగి: ఈనెల 15, 16, 17 తేదీల్లో కర్నూలులో జరిగే ఆంధ్ర రైతు సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరా రు. ఈ మేరకు మంగళవారం కోసిగిలో ఆటో జాత నిర్వహించారు. ప్రధాన కూడలిలో ఆయ న మాట్లాడుతూ వర్షభావ పరిస్థితుల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఎకరాకు రూ.30 వేలు పరిహారం ఇవ్వాలని, బ్యాంక్‌లో తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని కోరారు. రైతుల సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేద్దామన్నారు. మండలంలోని రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం మండల నాయకులు రాముడు, వీరేష్, నాగేంద్ర, చిన్నారెడ్డి, రా ముడు, కోసిగయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఆదోనిరూరల్: మండలంలోని సంతెకూడ్లూరు-ఇటిక్యాల మధ్య మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని మృతుడు మతిస్థిమితం లేని వ్యక్తినా, లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు తన సెల్ నంబర్ 91211 01143కు సమాచారం అందించాలన్నారు.

పాడి రైతులకు భరోసా

- అందుబాటులో కృత్రిమ గర్భదారణ ఇంజెక్షన్లు
- పలు ప్రోత్సాహకాలతో అండగా నిలుస్తున్న ప్రభుత్వం



ఆవుకు గర్భధారణ ఇంజెక్షన్ వేస్తున్న వైద్యాధికారి

ఆదోని సెంట్రల్: పాడి రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. వివిధ పథకాల ద్వారా అడుగడుగునా అండగా నిలుస్తూ వారిని ప్రోత్సహిస్తోంది. పశువులకు పెయ్య దూడలు పుట్టి రైతన్న అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కృతిమ పద్ధతిలో ఇంజెక్షన్ల ద్వారా పెయ్య దూడల ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. ఆదోని డివిజన్‌లో 7 ప్రాంతీయ పశు వైద్యశాలలు, 37 పశు వైద్య శాలలు, 41 గ్రామీణ పశు వైద్య కేంద్రాలతో పాటు గోపాల మిత్ర, ఆర్‌బీకే కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. డివిజన్‌లో తెల్లజాతి పశువులు 1,20,000, నల్లజాతి పశువులు 80,000 ఉన్నాయి. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ఆయా పశు వైద్యశాలలకు గర్భధారణ ఇంజెక్షన్లు సరఫరా చేశారు. గతంలో ఆవులు, గేదెలు చూడి కట్టాలి అంటే ఎద్దులు, దున్నలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా కృత్రిమ ఇంజెక్షన్ ద్వారా గర్భం ధరించే విధంగా ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి రైతు తమ ఇంట పెయ్య దూడలు పుడితే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని భావిస్తున్నారు. వారి ఆశలను నిజం చేసేందుకు ప్రభుత్వం పెయ్య దూడలు జననానికి కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు అందుబాటులోకి తెచ్చింది.

సబ్సిడీ ద్వారా ఇలా

లింగ నిర్ధారణ వీర్యంతో ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ చేసేందుకు సూది ధర రూ.1,350 ఉండగా ప్రభుత్వం రూ.850 సబ్సిడీ ఇస్తుంది. రైతు వాటా రూ.500 భరించాల్సి ఉంటుంది. మొదటి డోసుతో చూలు కట్టకపోతే రెండవ డోసు కూడా వేస్తారు కనుక రెండు డోసులకు కలిపి ఈ ధర నిర్ణయించారు. ఆవులు, గేదెలు లింగ నిర్ధారణతో ఎదకు వచ్చినపుడు మాత్రమే మొదటి సూది వేస్తారు. 21 రోజులలో మళ్లీ ఎదకు రాకపోతే రెండవ డోసు వేస్తారు. కృత్రిమ గర్భధారణ సూది వేసిన పశువులు చూలు కట్టకపోతే రైతు చెల్లించిన రూ.500 వెనక్కి ఇస్తారు. ఒక వేళ చూలు కట్టి మగ దూడ పుడితే రూ.250 తిరిగిస్తారు. గర్భధారణ ఇంజెక్షన్ల ద్వారా ప్రతి రైతు ఇంట పెయ్య దూడల జననం సులభతరమైంది.

పాడి రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డు

ప్రతి మనిషికి ఆరోగ్యశ్రీ కార్డు ఎలాగో పాడి కలిగిన ప్రతి రైతుకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డును ప్రభుత్వం జారీ చేసింది. రైతులకు ఎన్ని పశువులు ఉంటే అన్నింటినీ ఈ కార్డులో ఎంటర్ చేస్తారు. ఈ కార్డులో కృత్రిమ గర్భధారణ, చూడి నిర్ధారణ తేదీలు, దూడ పుట్టిన తేదీలను పొందుపరుస్తారు. ఏ తేదీన ఎలాంటి ఇంజెక్షన్లు వేశారు, రెండవసారి ఎప్పుడు వేయాలనే పూర్తి సమాచారం ఈ కార్డులో ఉంటుంది. ఈ కార్డు ద్వారా పశువులకు ఎక్కడైనా వైద్యం చేయించుకునే వెసులుబాటు కల్పించారు. పశువులు మరణిస్తే వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా నష్టపోయిన రైతులకు బీమా సొమ్ము చెల్లిస్తారు. సంకరజాతి, దేశీయ పశువులకు ఒక్కోదానికి రూ.30 వేలు, నాటు పశువులకు ఒక్కోదానికి రూ.15 వేలు చెల్లిస్తారు. ఇందులో ప్రభుత్వం వాటా 80 శాతం చెల్లిస్తే లబ్ధిదారుని వాటా 20 శాతం చెల్లించాల్సి ఉంటుంది.



పాడి రైతులకు పశు హెల్త్ కార్డులు

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పాడి పశువుల కోసం కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాడి రైతులు దగ్గరలోని పశు వైద్య కేంద్రాలకు పశువులను తీసుకెళ్లి ఇంజెక్షన్ చేయించవచ్చు. అలాగే పశువులకు సంబంధించి హెల్త్ కార్డులను కూడా జారీ చేస్తున్నాం. ఆ కార్డులో ఎప్పుడు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు వేశాం. తర్వాతి డోసు ఎప్పుడు వేయాలి అనే తేదీలను కూడా రాస్తారు, కనుక రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పివి.రమణ, పశు వైద్య సంచాలకులు, ఆదోని

ఆదోని వన్‌టౌన్ సీఐ బదిలీ



సీఐ విక్రమసింహా

ఆదోనిటౌన్: పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ విక్రమసింహా మంగళవారం కడప జిల్లా బద్వేల్‌కు బదిలీ అయ్యారు. విక్రమసింహా 2022 మే 2వ తేదీన కర్నూలు నుంచి ఆదోని పట్టణానికి బదిలీపై వచ్చారు. దాదాపు ఒకటిన్నర సంవత్సరం పాటు విధులు సమర్థవంతంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందారు. దొంగతనాల కేసుల్లో రూ.2 కోట్ల వరకు రికవరీ చేసి ఉన్నతాధికారుల నుంచి రివార్డులు పొందారు. ప్రస్తుతం ఆయన బదిలీ అవుతుండడంతో పోలీస్‌స్టేషన్‌లో సీఐ పోస్టు ఖాళీ ఏర్పడింది.

నేడు ఎండుమిర్చి యార్డు ప్రారంభం

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం నుంచి ఎండుమిర్చి యార్డు ప్రారంభిస్తున్నట్లు యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రైతులు దూర ప్రాంతాలకు వెళ్లి ఎండుమిర్చి దిగుబడులు విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కోకుండా, రవాణా ఖర్చులు, వారి సొంత ఖర్చులు వృథా గాకుండా స్థానిక యార్డులోనే ఎండుమిర్చి క్రయ, విక్రయాలు జరుపుకునేందుకు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. మిర్చి రైతులు నేటి నుంచి యార్డుకు ఎండుమిర్చి దిగుబడులు తీసుకొచ్చి విక్రయించుకోవచ్చన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా ప్రక్షాళన



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: అందరి సహకారంతో ఓటరు జాబితా స్పెషల్ సమ్మర్ రివిజన్-2024 క్యాంపెయిన్ విజయవంతంగా నిర్వహించినట్లు ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం సబ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ బూత్ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిలో పాత టీజీ ఎల్ పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని టీజీఎల్ పాలిటెక్నిక్ కళాశాలకు బదిలీ చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే తెలియజెప్పాలన్నారు. ఇప్పటివరకు ఆదోని నియోజకవర్గంలో ఫారం-6 (నూతన ఓటు నమోదు) 21,188 దరఖాస్తులు రాగా, 15,592 పూర్తయ్యాయని, పెండిగ్‌లో 5,596 ఉన్నాయన్నారు. ఫారం-7కు సంబంధించి 14,029 ఉండగా 12,280 డిస్పోజల్ కాగా పెండింగ్‌లో 1749 ఉన్నాయన్నారు. ఫారం-8లో పేరు, మార్పులు, చేర్పులు, చిరునామా, లింగం పోర్టల్ నుంచి సంబంధించిన సవరణల గూర్చి ఇప్పటివరకు 14,120 దరఖాస్తులు రాగా 12,340 పూర్తయ్యాయని, పెండింగ్‌లో 1780 ఉన్నాయన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 సంబంధించి డిసెంబర్ 25వ తేదీలోపు పూర్తి చేస్తామన్నారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, సీనియర్ సహాయకులు కాశీం, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆడుదాం – ఆంధ్ర' విజయవంతంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారాజు

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం – ఆంధ్ర' క్రీడా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీడీలు ఖలీల్ అహ్మద్, రాజారాం ఆధ్వర్యంలో మండలంలోని పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు క్రీడా పోటీల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల నైపుణ్యం వెలికి తీసేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆరు రోజుల పాటు సచివాలయ పరిధిలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఈ నెల 21వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు మండల స్థాయిలో క్రీడాపోటీలు ఉంటాయన్నారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడాంశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సత్తా చాటిన క్రీడాకారులు మండల స్థాయి నుంచి తాలుకా స్థాయిలో, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ మాధవ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, క్రీడా కన్వీనర్లు పాల్గొన్నారు.

కౌతాళం: 'ఆడుదాం – ఆంధ్ర' టోర్నమెంట్-2023ను ప్రతిష్మాత్మకంగా తీసుకుని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. క్రీడా పోటీల నిర్వహణపై మంగళవారం వలంటీర్లకు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఉదయం ఒక బ్యాచ్‌కు, మధ్యాహ్నం 3 గంటలకు ఒక బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించాలని సూచించారు. పీడీలు, పీఈటీలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో అమావాస్య పూజలు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్గాల్లో ఒకటి, కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో మంగళవారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. దర్గాలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన



ఆదోని డిపో ముందు ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆదోనిటౌన్: ప్రజా రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఉద్యోగులు స్థానిక డిపో ముందు ధర్నా చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన చేపట్టినట్లు డిపో సలహాదారుడు లక్ష్మన్న, కార్యదర్శి హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ బసవరాజ్, అధ్యక్షులు దాదా, గ్యారేజీ కార్యదర్శి షరీఫ్ తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఈపీఎస్ 95, సీపీఎస్‌పై ఆప్షన్ నిలుపుదల చేసి ఉద్యోగి ఎప్పుడైనా ఆప్షన్‌ను పొందే వెసులుబాటు కల్పించాలని కోరారు. ఆర్‌పీఎస్ 2017 అరియర్స్ ఉద్యోగులందరికీ ఒకేసారి చెల్లించి తద్వారా సీపీఎస్ 95కు చెల్లింపులు చేసుకొని, హయ్యర్ పెన్షన్‌ను పొందేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ నుంచి మినహాయింపు చేస్తూ సంస్థలో ఇదివరకే ఉన్న పరిమితి లేని వైద్యాన్ని అందించాలన్న డిమాండ్లతో ఆందోళన చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరవధిక దీక్షలో పాల్గొన్న గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు

ఆదోనిఅర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని ఆలిండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు వై.మునిస్వామి, వై.కృష్ణ డిమాండ్ చేశారు. పీజేసీఏ పిలుపు మేరకు ఆదోని హెడ్ పోస్టాఫీసులో మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8 గంటలు పని కల్పించి పెన్షన్ సహా అన్ని ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేశారు. సీనియర్ జీడీఎస్‌లందరికీ అదనపు ఇంక్రిమెంట్ల మంజూరు, గ్రాట్యుటీ, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షల వరకు పెంచాలన్నారు. ఈ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని చెప్పారు. సంఘం నాయకులు కె.శ్రీనివాస రావు,చాంద్‌బాషా,చంద్రశేఖర్, రంగస్వామి, గణేష్, నరసింహులు, రవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల అభ్యున్నతి



ఆదోని 25వ వార్డులో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



ఇందిరానగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆదోనిఅర్బన్: ప్రజలు మెచ్చిన నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, వైస్ చైర్మన్ బి.నరసింహులు, జేసీఎస్ టౌన్ కన్వీనర్ వెల్లాల మధుసూదనశర్మ అన్నారు. మంగళవారం ఆదోని పట్టణంలోని 25వ వార్డుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ కృష్ణవేణి అధ్యక్షతన ఇన్‌చార్జ్‌లు జి.కె.రాజు, సిద్ధమల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు, అనేక పథకాలను మంజూరు చేశారని వివరించారు. సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగనన్నను రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. అనంతరం 25వ వార్డులో లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని అసిస్టెంట్ కమిషనర్ అనుపమ వివరించి, ప్రగతి బోర్డును ఆవిష్కరించారు. వార్డు కన్వీనర్లు గోవిందరాజు, రాఘవేంద్ర, మల్లికార్జున, శివ, నరసింహా, అంజి, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ఆదోనిలో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మంగళవారం 17, 18, 19 వార్డుల్లో గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా ఇందిరానగర్, సచివాలయం పరిధిలో గడప గడపకు తిరుగుతూ కరపత్రాలను పంచుతూ ప్రచారం చేపట్టారు. మరోసారి వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని, మరిన్ని సంక్షేమ పథకాలు అందుకుదామని వివరిస్తూ ప్రచారం చేశారు. కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు విశ్వనాథ్, ఉప్పరనారాయణ, రాజశేఖర్, మధు, పరమేష్, నాగరాజ్, మహేష్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే రాష్ట్రంలో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, వల్లూరు గ్రామ ఇన్‌చార్జ్ మరేగౌడ్, మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వల్లూరు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండా, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యదర్శి అబ్దుల్‌కరీం, నాయకులు ఈశప్పగౌడ్, నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పథకాల అమల్లో నిర్లక్ష్యం తగదు

ఆదోనిరూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం అర్హులైన వారికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ ఆదోని అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఆదోని మండలంలోని కపటి, పెసలబండ గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు, బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పథకాల అమలు తీరులో స్థానిక యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పీఎం ఆవాస్ యోజన అమలు తీరు స్థానిక అధికారుల నిర్లక్ష్యం వల్ల సంతృప్తికరంగా లేదన్నారు. ఏపీఓ చంద్రశేఖర్, ఏపీడీ జనార్దన్, మెడికల్ ఆఫీసర్లు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

పరీక్షల పట్ల భయం వీడాలి

పత్తికొండ రూరల్: విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మిదేవి సూచించారు. మంగళవారం పత్తికొండలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో డివిజన్ పరిధిలోని హాస్టళ్లలో ఉంటున్న పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి అత్యధిక మార్కులు సాధించాలన్నారు. సందేహాలు తలెత్తితే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బాబు, ఇంపాక్ట్ సంస్థ సైకాలజిస్టు మహేంద్ర, హెచ్ఎం ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది నిరసన

కౌతాళం: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కౌతాళంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి అధ్యక్షతన నిరసన తెలపగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు జీతాలు పెంచాలని, రిటర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఖాసీంబీ, కామాక్షి, విజయలక్ష్మి, రాధ, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హొళగుంద: మండల కేంద్రం హొళగుంద శివారులో పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసి బెయిల్‌పై విడుదల చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ మంగళవారం విలేకరులకు తెలిపారు. హొళగుంద శివారులోని సుళువాయి రోడ్డులో గల మిట్ట వద్ద కొందరు పేకాట ఆడుతుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 27 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. అలాగే 9 బైక్‌లను సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తజనం





పూజలందుకుంటున్న ఈరన్న స్వామి మూలవిరాట్ , ఆలయం వద్ద భక్తుల రద్దీ

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి దేవాలయం వేలాది మంది భక్తులతో సందడి నెలకొంది. మంగళవారం అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకోవడానికి వేలాదిగా తరలివచ్చారు. కార్తీక మాసం చివరిరోజు కావడంతో తరలివచ్చిన భక్తజనంతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. స్వామివారి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. భక్తులకు విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శ్రీఘ్ర దర్శనం, ఉచిత, వీఐపీ దర్శనాల ద్వారా దర్శనానికి పంపారు. ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లో కూడా భక్తులు గంటకు పైగా నిలబడి స్వామివారి దర్శనం చేసుకున్నారు. కొందరు భక్తులు పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల సౌకార్యర్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప డిపోలవారు ప్రత్యేక బస్సులను నడిపారు. కౌతాళం పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

- అలాగే ఉరుకుందకు ఐదు కిలోమీటర్ల దూరంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులతో సందడిగా నెలకొంది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆంజనేయస్వామిని దర్శనానికి కూడా తరలిరావడంతో ఈ క్షేత్రం కిటకిటలాడింది.
- తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. కర్ణాటక సరహద్దు ప్రాంతం కావడంతో అధికంగా కర్ణాటక భక్తులు కూడా తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బైక్ దొంగల అరెస్ట్

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తితోపాటు పలు చోట్ల బైక్‌లను దొంగలించిన ఇద్దరిని అరెస్ట్ చేసి, మూడు బైక్‌లను రికవరీ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆరు నెలల క్రితం వెల్దుర్తిలో బైక్ చోరీ కేసు నమోదైంది. దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ బృందం విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్‌హెచ్-44 పక్కన బొమ్మిరెడ్డిపల్లె శివాలయం వద్ద మంగళవారం ఇద్దరు దొంగలను అరెస్ట్ చేశారు. నిందితులు నంద్యాల జిల్లా, మాధవరం గ్రామం దర్శినేని నాగభూషణం, తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన అనిల్‌గా తెలిసింది. వారిని రిమాండ్‌కు తరలించారు.